

ఉచిత పాసుల విక్రయం

మల్లికార్జున స్వామి ఆలయంలో ఉచిత వీవీఐపీ పాసులు విక్రయించిన ఘటన సంచలనం సృష్టిస్తోంది.

వివరాలు 8లో ▸



కొనసాగుతున్న ఈ కేవైసీ

ఈ కేవైసీ ప్రక్రియ చురుకుగా సాగుతోంది. జిల్లాలో ఇప్పటి వరకు 80% పూర్తయింది.

వివరాలు 8లో ▸



ఉడకని అన్నం.. నీళ్ల చారు

గురుకులంలో మధ్యాహ్న భోజనం అధ్వానంగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ఆస్తుల జప్తునకు ఆదేశం

మెదక్ కలెక్టరేట్: సీఎంఆర్ విషయమై ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు బకాయి పడిన ప్రముఖ వ్యాపారి పైడి శ్రీధర్‌గుప్త ఆస్తుల రికవరీకి ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ రాజర్షి షా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సాపూర్ మండలానికి చెందిన రైస్ మిల్లర్ అయిన అతను ప్రభుత్వానికి రూ.57 కోట్ల 17 లక్షల 73 వేల 760లు బకాయిపడ్డాడన్నారు. 2001–22, 2022–23 సంవత్సరాలకు గానూ ఇది చెల్లించలేదని, దీంతో తెలంగాణ రెవెన్యూ రికవరీ చట్టం 1864 (ఆర్ఆర్‌ఆక్ట్) కింద జప్తు చేయడానికి నోటీసులు జారీ చేశామని తెలిపారు.

జిల్లా స్థాయి చెకుముకి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బహుమతిని అందుకుంటున్న విద్యార్థులు

టేక్మాల్(మెదక్): జిల్లా స్థాయి చెకుముకి పోటీల్లో టేక్మాల్ మండలంలోని దనూర పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచినట్లు హెచ్ఎం వసంత తెలిపారు. ఆదివారం నర్సాపూర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో లింగమయ్య (8వ తరగతి), వాసవి (9వ తరగతి), నందు (10వ తరగతి) పరీక్షలు రాసి సత్తా చాటారని తెలిపారు. విద్యార్థులను ఆమెతోపాటు ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

గ్రామాల అభివృద్ధిలో యువత కీలకం

మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి



నేచర్ ఐకాన్ యువతను సన్మానిస్తున్న నర్సారెడ్డి తదితరులు

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామాల అభివృద్ధికి యువతే కీలకమని మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కూచారం గ్రామంలో నేచర్ ఐకాన్ యూత్ 300వ వారం స్వచ్ఛ భారత్‌లో భాగంగా ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. ఆయన, సంగారెడ్డి జిల్లా డీఆర్డీఓ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో మొక్కలు నాటారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ కూచారం యువత పలు గ్రామాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. యువత చదువుతో పాటు సోషల్ వర్కర్‌గా కూడా తమ బాధ్యతలు పంచుకున్నప్పుడే వారి జీవితంలో మంచి మార్పులు వస్తాయన్నారు. తొలుత యువకులకు, పాత్రికేయులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యాదగిరిరెడ్డి, సిద్దిపేట జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు సంతోష్ పంతులు, ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మీనర్సింహులుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రమేష్‌చారి, సత్యనారాయణ, మహిపాల్‌రెడ్డి, నేచర్ ఐకాన్ యువత, బీఆర్‌ఎస్ నాయకులు ఉదయ్‌రంజన్‌గౌడ్, నరేష్ దాసరి, కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడి ఎన్నిక



జిల్లా అధ్యక్ష, కార్యదర్శులను సన్మానించిన రాష్ట్ర కమిటీ సభ్యులు

చిన్నశంకరంపేట(మెదక్): తెలంగాణ అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా చిన్నశంకరంపేట మండలం ముత్తిగల్ల రామచంద్రం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మెదక్‌లో తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిషన్, మైనార్టీ విభాగం నాయకులు షేక్ అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ ఎన్నికలను నిర్వహించారు. జిల్లా కార్యదర్శిగా ఖాజాపూర్ గ్రామానికి చెందిన మన్నే బాలస్వామి, జిల్లా ఉపాధ్యక్షులుగా నీరుడి బాల్‌రాజ్, కంబాల పోచయ్యలను ఎన్నుకున్నారు.

పద్య సాహిత్యం అవసరం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పద్య సాహిత్యం ద్వారా సమాజంలో మార్పు తీసుకురావచ్చని జాతీయ సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఎన్నవెల్లి రాజమౌళి అన్నారు. ఆదివారం సిద్దిపేటలో జరిగిన అవధాని బండకాడి అంజయ్య గౌడ్ రచించిన సుధీ శతకం పరిచయ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

కూలీలకు అండగా ఉపాధి

- 2024–25కు గాను 40.10 లక్షల పనిదినాలు ప్రతిపాదన
- జిల్లాలో 3.28 లక్షల కూలీలకు ప్రయోజనం
- గతేడాది లక్ష్యాన్ని అధిగమించిన పరిస్థితి

2024–25 సంవత్సరానికి గాను ఉపాధి కూలీలకు చేతి నిండా పని దొరకనుందని తెలుస్తోంది. ఇప్పటికే పనులను గుర్తించి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఎన్ని దినాలకు ఆమోదం లభిస్తుందో తెలియాల్సి ఉంది. గతేడాది 103 శాతం ఉపాధి పనులు చేపట్టి లక్ష్యాన్ని అధిగమించారు. ఈ ఏడాది గతేడాది కంటే 10 లక్షల పనిదినాలు అదనంగా ప్రతిపాదించారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

మెదక్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం(ఎంజీఎన్ఆర్ఈజీఎస్)లో భాగంగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి 40,10,204 పనిదినాలకు ప్రతిపాదించారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో సభలు నిర్వహించి పనులు గుర్తించారు. ఆపై కేంద్రానికి పంపించారు. గత సంవత్సరం 30 లక్షల పనిదినాలు కల్పిస్తే 36,13,236 పనిదినాలను పూర్తి చేశారు. ఇది 103 శాతంతో సమానం.

మెదక్ జిల్లా వ్యాప్తంగా 21 మండలాల పరిధిలో 469 గ్రామ పంచాయితీలున్నాయి. ఇందులో భాగంగా అన్ని గ్రామాల్లో 1,62,893 జాబ్ కార్డులు ఉన్నాయి. 3,28,133 మంది కూలీలున్నారు. 2023 అక్టోబర్ 2 నుంచి నవంబర్ 30 వరకు గ్రామాల్లో సభలు నిర్వహించి ఆయా గ్రామాల్లో ఏ పనికి ప్రాధాన్యత ఇస్తే బాగుంటుందని గ్రామస్తుల సమక్షంలో చర్చించడం ఉన్నతాధికారులకు పంపించడం కూడా జరిగిపోయింది. ఇందులో అత్యధికంగా వ్యవసాయ అనుసంధాన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలు, కూలీలు కోరినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

వచ్చే ఆర్థిక సంవత్సరానికి గాను ఉపాధి కింద ఎక్కువగా ఉపరితల నీటి నిల్వ కుంటలు (స్టోరేజ్ ట్యాంకు), కల్లాలు, పాంపాండ్స్, నాడెం కంపోస్ట్ షెడ్లు, పంట పొలాలకు అనుసంధానమైన మట్టి రోడ్లు, చిన్న, పెద్ద నీటి కుంటలు, భూ అభివృద్ధి, ఫీడర్ చానళ్లు, కందకాలు, చెరువుల్లో మట్టితీత తదితర పనులకు ప్రాధాన్యమిచ్చారు. చాలా గ్రామాల్లో కూలీలు, రైతులు వీటికి సంబంధించిన పనులు అడిగారు.

➡ మౌలిక సదుపాయాల కింద.. వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, వినియోగంలో లేని రోడ్లను బాగు చేయడం, పాడుబడిన బావుల పూడ్చివేత, హరితహారంలో భాగంగా మొక్కలు నాటడం కోసం గుంతలు తీయడం, కంచెల నిర్మాణం, మొక్కలకు నీరు పోసే పనులు నిరంతరం కొనసాగించాలని తీర్మానించారు.

➡ కాగా ఇటీవల పనుల గుర్తింపు విషయమై జిల్లాలోని అన్ని మండలాల్లో నిర్వహించిన గ్రామ సభల్లోనే ప్రజా ప్రతినిధులు కలుగజేసుకున్నారు. పనుల దగ్గర కొచ్చేసరికి పర్యవేక్షించడం లేదు. మండల స్థాయిలో ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలు, ఫీల్డ్ అసిస్టెంట్లు మాత్రమే పర్యవేక్షిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఉపాధి పనులపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

లక్ష్యాన్ని మించి..

2023–24లో జిల్లాలో ఉపాధి కూలీలకు 30 లక్షల పనిదినాలు కల్పించాలన్నది లక్ష్యం. కానీ 36,13,234 రోజుల పనిదినాలు పూర్తయినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇది 103 శాతం చేరుకున్నామని అధికారులు చెబుతున్నారు. ఇది జిల్లాలో వ్యవసాయ పనుల తర్వాత ఈ పథకానికే ఎక్కువ డిమాండ్ ఉంది.

పనులు కల్పిస్తాం



జిల్లాలో పనులు లేక ఇతర ప్రాంతాలకు ఏ కూలీ వలస పోకూడదు. తమ స్వగ్రామాలలోనే పనులు కల్పిస్తాం. పనిని బట్టి కూలి గిట్టుబాటవుతుంది. ఈ అవకాశాన్ని వారు సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీనివాస్ డీఆర్‌డీఓ మెదక్





మాట్లాడుతున్న ఈటల రాజేందర్, రఘునందన్‌రావు

పార్లమెంట్ ఎన్నికల్లో.. బీజేపీ జెండా ఎగరాలి

ఆపార్టీ రాష్ట్ర నాయకుడు ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు

మనోహరాబాద్(తూప్రాన్): అప్పుల తెలంగాణ నుంచి బంగారు తెలంగాణ కావాలంటే మళ్లీ కేంద్రంలో మోదీ సర్కారు రావాలని పార్టీ రాష్ట్ర నాయకుడు ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మెదక్ పార్లమెంటరీ ముఖ్య కార్యకర్తల సమన్వయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి, సిర్పూర్–కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ నియంతృత్వం ఎక్కడ ఉంటుందో అక్కడ ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. ప్రతిపక్షం లేకుండా చేయాలని భావించిన కేసీఆర్‌ను ప్రజలు ప్రతిపక్షానికే పరిమితం చేశారని గుర్తుచేశారు. ఈ మాజీ సీఎం ఖాతాలో రూ.900 కోట్లు ఉన్నాయని ఇవి ఎక్కడివని? ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ అధినేత రూట్‌లో ఇప్పుడు కాంగ్రెస్ వెళ్తుందన్నారు. ఇచ్చిన హామీలు నేరవేర్చలేకే వాయిదాలు వేస్తుందన్నారు. రైతులకు రుణమాఫీ సొమ్ము విడుదల చేశామని చెబుతుందే కానీ ఇప్పటి వరకు కూడా అనేక మందికి జమ కాలేదన్నారు. ఇక హామీల్లో ఒకటైన పింఛన్లు పెంచి ఇచ్చేందుకు ఇప్పటివరకు తీరిక లేదా? అని విమర్శించారు. అలాగే అయోధ్య రాముడి గుడి కట్టడంతో ప్రతి ఇంటి మహిళలు మోదీనే ప్రధానిగా ఉండాలని కోరుకుంటున్నారని అన్నారు. అనంతరం రఘునందన్‌రావు మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధిలో ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి, వీధివీధికి సీసీ రోడ్డులు, జాతీయ రహదారులు, తారురోడ్డులు, గజ్వేల్, మెదక్‌ల్లో రైలు లైన్లు వేసిన చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. దీంతో ప్రజలు మోదీనే మళ్లీ పీఎం కావాలని కోరుకుంటున్నారని అన్నారు. కేసీఆర్ నియంతృత్వ పాలనకు ప్రజలు చరమగీతం పాడారన్నారు. ఎక్కడైతే పార్టీ కార్యకర్తలు కష్టించి పని చేస్తారో అక్కడ గెలుపు ఖాయమన్నారు. మెదక్ ఎంపీ సీటును గెలిపించి మోదీకి బహుమతిగా ఇద్దామన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా నియోజకవర్గ అధ్యక్షులు శ్రీనివాస్, గోదావరి, మోహన్‌రెడ్డి, పార్టీ మనోహరాబాద్ మండల అధ్యక్షుడు కమ్మరి నరేందర్‌చారి, నాయకులు నత్తి మల్లేష్, చంద్రశేఖర్, నరేందర్‌రెడ్డి, మెదక్ పార్లమెంట్ పరిధి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ముఖ్య నాయకులతో తరుణ్‌చుగ్ సమావేశం

ముఖ్యకార్యకర్తలతో సమావేశం నిర్వహించిన అనంతరం పట్టణంలోని శుభం గార్డెన్‌లో మెదక్ పార్లమెంటరీ నాయకులతో కలిసి జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్‌చుగ్ పార్టీ అంతర్గత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన పలు సూచనలు చేసినట్లు నాయకులు తెలిపారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే విద్యారంగం నిర్వీర్యం

టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్



మాట్లాడుతున్న అశోక్ కుమార్

మెదక్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్ విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా 22 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయలేదన్నారు. ఆదివారం పట్టణంలోని ద్వారకా గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విద్యాసదస్సులో ఆయన మాట్లాడారు. స్కావెంజర్లను ఏర్పాటు చేయలేని దుర్భరమైన స్థితిలో బీఆర్‌ఎస్ పాలన ముగిసిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అయినా కొంత స్వేచ్ఛ నిచ్చిందన్నారు. సంబంధిత అధికారులతో నేరుగా ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యలను విన్నవిస్తున్నట్లు చెప్పారు. మేధావులు ఎప్పుడైనా మౌనంగా ఉండటం సమాజానికి మంచిది కాదన్నారు. 317 జీఓకు వ్యతిరేకంగా ఉద్యమించామని, సీపీఎస్ రద్దు కోసం పోరాడామన్నారు. కొంతమందికే నాణ్యమైన విద్యా అందుతుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో రెసిడెన్షియల్ స్కూళ్లను పెంచి ప్రభుత్వ స్కూళ్లను నిర్వీర్యం చేసిందని వాపోయారు. అనేక పాఠశాలల్లో హెచ్ఎంలు, మండలాల్లో ఎంఈఓలు, జిల్లాల పరిధిలో డీఈఓలు లేరన్నారు. ఆయా పాఠశాలల పాస్ శాతం తక్కువగా ఉంటే ఆ నెపం టీచర్లపై నెట్టివేశారని మండిపడ్డారు. గతంలో అధికారమంతా కేసీఆర్ కుటుంబం చేతుల్లోనే ఉండేదని దీంతో ప్రభుత్వ పాఠశాలలపై శీతకన్ను పెట్టారన్నారు. కాంగ్రెస్ సర్కారు విద్యారంగానికి బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇవ్వటం శుభపరిణామన్నారు. అనంతరం ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడుతూ, ఈనెల 11, 12వ తేదీల్లో ఖమ్మంలో విద్యా వైజ్ఞానిక రాష్ట్ర మహాసభలు జరగబోతున్నాయని ఉపాధ్యాయులంతా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై టీపీటీఎఫ్ ముందుండి పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సంగయ్య, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, దేవిసింగ్, ఉన్నారు.

కనుల పండువగా లక్ష్మీనర్సింహస్వామి జాతర



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకుడు



కోనేరులో స్నానమాచరిస్తున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి జాతర కనుల పండువగా జరుగుతుంది. ప్రతి యేటా మూడు నెలల పాటు ప్రతి ఆదివారం మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. స్వామికి పూజారులు ధనుంజయ్‌శర్మ, విద్యాకర్‌చారిలు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో గుడారాలు ఏర్పాటు చేసుకుని వంటావార్పు చేపట్టారు. కోనేరులో స్నానమాచరించి గుట్టపై కొలువైన స్వామిని కాలినడక వెళ్లి దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ శశిధర్, సిబ్బంది రామకృష్ణ, నర్సింహారెడ్డి, తదితరులు ఉన్నారు.

రాంపూర్ శివారులో చిరుత!



సీసీ కెమెరాలో చిక్కిన చిరుత



గాయపడిన లేగదూడ

చేగుంట(తూప్రాన్): మండలంలోని రాంపూర్ గ్రామ శివారులో చిరుత సంచారంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారు తండా సమీపంలో ఉన్న పశువుల పాకలోని మూగజీవాలపై శనివారం రాత్రి పులి దాడి చేసింది. దీంతో ఒక లేగదూడ గాయపడింది. అప్పటికే కుక్కలు మొరగడంతో అక్కడి నుంచి పరారైంది. మరలా ఈ గ్రామ శివారులోని వరి పొలాల్లోనూ పాదముద్రలను స్థానికులు గుర్తించారు. ఆదివారం ఫారెస్టు అధికారులకు మాజీ సర్పంచ్ భాస్కర్ సమాచారం అందించారు. వారు వచ్చి వాటిని పరిశీలించి చిరుతవేనని ధ్రువీకరించారు. గ్రామస్తులు జాగ్రత్తగా ఉండాలని సూచనలు చేశారు. తండా పరిసరాల్లో కనిపిస్తే తమకు సమాచారం అందించాలని గ్రామస్తులకు సూచించారు. అయితే సీసీ కెమెరాలో పులి సంచరించడం రికార్డు అయ్యింది.

సీఎస్ఐ చర్చి కిటకిట



ప్రార్థనలో భక్తులు

మెదక్: ప్రపంచ ప్రసిద్ధి గాంచిన మెదక్ సీఎస్ఐ చర్చి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా చర్చి ప్రెస్బిటరీ ఇన్‌చార్జి శాంతయ్య ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు భక్తులనుద్దేశించి దైవసందేశాన్ని ఇచ్చారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల సౌకర్యార్థం చర్చి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

గురుకులాల్లో నియామకాలు చేపట్టాలి

- ఆ తర్వాతే బదిలీలు, పదోన్నతులు
- పీఆర్‌జీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ కుమార్‌రెడ్డి డిమాండ్



మాట్లాడుతున్న దిలీప్ కుమార్‌రెడ్డి

మెదక్: నూతన నియామకాలు చేపట్టే ముందే గురుకులాల ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ అసోసియేషన్ (పీఆర్‌జీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు వేమిరెడ్డి దిలీప్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పీఆర్‌జీటీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన గురుకులాల ఉపాధ్యాయ, అధ్యాపకుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీసీ జనరల్ గురుకులాల పనివేళలు మార్చాలన్నారు. అన్ని గురుకులాలకు కామన్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలన్నారు. 317 జీఓ సమస్యను సత్వరం పరిష్కరించి అర్హులైన ఉద్యోగులందరికీ బదిలీలు, పదోన్నతులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. పని ఒత్తిడి తగ్గించి, శ్రమకు తగిన వేతనాలు ఇవ్వాలన్నారు. పాఠశాలలకు శాశ్వత వసతి భవనాలు నిర్మించాలన్నారు. ఉపాధ్యాయులకు రాత్రివేళల్లో విధులను తప్పించి కేర్ టేకర్లను నియమించాలన్నారు. 010 ద్వారా వేతనాలు చెల్లించి టీఎస్‌జీఎల్ఐ వర్తింపజేస్తూ రెండో శనివారం సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

మల్లన్న.. మమ్మేలు

- కొమురవెల్లికి తరలివచ్చిన భక్తజనం
- స్వామి నామస్మరణతో మారుమోగినశైవక్షేత్రం



స్వామి వారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

కొమురవెల్లి(సిద్దిపేట): కోరమీసాల మల్లన్న స్వామి.. కోటొక్క దండాలు.. సత్తేటి వారాలా స్వామి కరుణించు.. అంటూ భక్తుల మల్లికార్జున స్వామిని దర్శించుకుని తరించారు. ఆదివారం కొమురవెల్లికి భక్తులు పోటెత్తారు. మల్లన్న బ్రహ్మోత్సవాల్లో మూడో ఆదివారం కావడంతో వివిధ జిల్లాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మల్లన్న నామస్మరణతో ఆలయ పరిసరాలన్నీ మారుమోగాయి. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అదనపు డీసీపీ మల్లారెడ్డి ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి, ఈవో బాలాజీలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దర్శించుకున్న ప్రముఖులు..

మల్లికార్జున స్వామిని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, మాజీ మంత్రి శ్రీనివాస్ యాదవ్, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ కుటుంబ సమేతంగా వచ్చి దర్శించుకుని పూజలు చేశారు.



ఆలయ పరిసరాల్లో భక్తుల రద్దీ

అయ్యో.. బిడ్డా..

- విద్యుదాఘాతంతో వివాహిత మృతి
- వాటర్ హీటర్ తాకడంతో ఘటన
- పెళ్లయి ఏడాది గడవక ఉందే విషాదం
- కన్నీటి సంద్రమైన మాసానిపల్లి



పవిత్ర (ఫైల్)

వట్‌పల్లి(అందోల్): పెళ్లయి ఏడాదైనా గడవక ముందే ఓ వివాహిత విద్యుదాఘాతంతో చనిపోయింది. రోజూ అందరినీ పలకరిస్తూ కలిసిమెలిసి ఉండే ఆమెను అంతలోనే మృత్యువు కబళించింది. ఈ సంఘటన అందోల్ మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మాసానిపల్లి గ్రామానికి చెందిన బంటు పవిత్ర (21) ఆదివారం ఉదయం ఎప్పటిలాగే నిద్రలేచి, వాకిలి శుభ్రం చేసి వాటర్ హీటర్‌తో నీటిని వేడి చేసుకుంది. స్నానం చేసి బట్టలు మార్చుకునే సమయంలో విద్యుత్ సరఫరా అవుతున్న హీటర్‌ను ముట్టుకుంది. దీంతో విద్యుత్ షాక్‌కు గురైన పెద్దగా కేక వేస్తూ కిందపడిపోయింది. పక్కనే మంచంపై నిద్రిస్తున్న భర్త నవీన్ లేచి భార్యను పట్టుకోబోయాడు. అతనికీ షాక్ తగిలినట్లు అనిపించడంతో వెంటనే హీటర్ ప్లగ్‌ను తొలగించాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన పవిత్రను ఆటోలో జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యుడు పరీక్షించి ఆమె మృతిచెందినట్లు ధ్రువీకరించాడు.

ఆస్పత్రికి వందలాదిగా బంధువులు

పవిత్ర మృతి చెందిన విషయం తెలుసుకున్న బంధువులు ఆస్పత్రి వద్దకు భారీగా చేరుకున్నారు. మృతదేహాన్ని పట్టుకుని తల్లి సుశీల గుండెలు అవిసేలా రోదించింది. నువ్వు ఇక లేవా బిడ్డా అంటూ కన్నీరు పెట్టుకుంది. పవిత్రను ఉదయం 7 గంటల ప్రాంతంలో ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆమె చనిపోయినట్లు అరగంటలో డాక్టర్లు ధ్రువీకరించారు. దీనిపై భర్త నవీన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తహసీల్దారు అందుబాటులో లేకపోవడంతో మృతురాలి బంధువులు 3గంటలపాటు వేచి చూడాల్సి వచ్చింది.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌కు ప్రాజెక్టులు ఎంపిక



రాకేష్ రూపొందించిన అమేజింగ్ అంబ్రెల్లా ప్రాజెక్టు

గజ్వేల్‌రూరల్: రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనకు మండల పరిధిలోని అహ్మదీపూర్ లోగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం సుగుణాకర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు బి.రాకేష్ రూపొందించిన అమేజింగ్ అంబ్రెల్లా, ఎం.లక్ష్మీనర్సింహాగౌడ్ రూపొందించిన ఆటోమెటిక్ బ్లాక్ బోర్డ్ క్లీనర్ అనే ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయన్నారు. విద్యార్థులను జిల్లా సైన్స్ అధికారి కల్లెపల్లి శ్రీనివాస్, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు.

చెరువులో పడి యువకుడి మృతి



ప్రభాకర్(ఫైల్)

గజ్వేల్‌రూరల్: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని చిన్న ఆరెపల్లి(ఎస్‌బీ)లో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అందె ప్రభాకర్(33) కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. శనివారం రాత్రి బహిర్భూమికని వెళ్ళి చిన్న ఆరెపల్లి–బెజుగామ గ్రామాల మధ్యలో ఉన్న రాగి చెరువులో ప్రమాదవశాత్తు పడ్డాడు. గ్రామస్తులు ఆదివారం మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రెయిలింగ్‌ను ఢీకొన్న లారీ



వంతెనపై అదుపుతప్పిన లారీ

రాయికోడ్(అందోల్): ఓ లారీ అదుపుతప్పి వంతెన రెయిలింగ్‌ను ఢీకొన్న ఘటన సిరూర్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. నాగ్వార్ శివారులో ఉన్న ఓ జిన్నింగ్ మిల్లు నుంచి పత్తి విత్తనాల బస్తాలను లోడ్ చేసుకుని ఒక లారీ అల్లాదుర్గం వైపు వెళుతున్న క్రమంలో మంజీరానదిపై ఉన్న వంతెనపై అదుపుతప్పి రెయిలింగ్‌ను ఢీకొట్టింది. దీంతో ముందుభాగం తగలడంతో లారీ ఒక పక్కకు ఒరిగిపోయింది. డ్రైవర్, క్లీనర్ ప్రమాదం నుంచి బైటయపడ్డారు. కొన్ని బస్తాల నదిలో పడి కొట్టుకుపోయాయి.

వీఆర్‌ఏ ఆత్మహత్య

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఆర్థిక ఇబ్బందులతో వీఆర్‌ఏ శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని సూరారం గ్రామానికి చెందిన మన్నే ఆగమయ్య(54) వీఆర్‌ఏగా పనిచేస్తున్నాడు. వీఆర్‌ఏల సర్దుబాటులో భాగంగా మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్నాడు. ఆరు నెలలుగా వేతనాలు రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికిగురై ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నవీన్ కుమార్ తెలిపారు.

మల్లన్న సాక్షిగా..
ఉచిత పాసుల విక్రయం

- రూ.1000 నుంచి 1500 వరకు వసూళ్లు
- ఏఈవో గంగా శ్రీనివాస్‌పై అనుమానం
- ఐదుగురు వలంటీర్లను అరెస్టు చేసిన పోలీసులు



వలంటీర్లను విచారిస్తున్న ఆలయ సిబ్బంది, తదితరులు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయంలో ఉచిత వీవీఐపీ పాసులను విక్రయించిన ఘటన సంచలనం సృష్టించింది. స్వామివారి దర్శనానికి వచ్చే వీవీఐపీలకు ఆలయ అధికారులు ఉచితంగా పాసులు జారీ చేస్తారు. ఈ పాసులను జారీచేసే అధికారం ఆలయ ఈవో, ఏఈఓకు ఉంటుంది. ఘనంగా జరుగుతోన్న స్వామి వారి బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతుండడంతో దర్శనానికి అధిక సమయం పడుతోంది. దీనిని ఆసరా చేసుకొని కొంత మంది ఈ పాసుల విక్రయ దందాకు తెరలేపారు. ఆదివారం ఆలయంలో పనిచేసే ఐదుగురు వలంటీర్లు పబ్బోజు శ్రీనివాస్, పెద్ది భాస్కర్‌రెడ్డి, చల్లా శేఖర్ రెడ్డి, స్వాములపల్లి కరుణాకర్, రమణకుమారి భక్తులకు ఒక్కో పాసును రూ.1000 నుంచి రూ.1500లకు విక్రయించారు. ఈ విషయపై కొందరు భక్తులు ఆలయ ఈవో బాలాజీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు వీవీఐపీ క్యూలైన్లో పాసులను తనిఖీ చేశారు. అందులో వలంటీర్లు విక్రయించిన సుమారు 100 పాసులు బయటపడ్డాయి. ఈపాసులపై ఆలయ ఏఈఓ గంగా శ్రీనివాస్ సంతకాలు చేసినట్టు ఉంది. దీంతో ఆలయ ఏఈఓనే వాటా తీసుకొని వలంటీర్లతో కుమ్మక్కై పాసులు విక్రయిస్తున్నట్లు ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. పాసులు విక్రయించిన వారిలో ఏఈఓ కారు డ్రైవర్ పెద్ది భాస్కర్ రెడ్డి ఉండడం పలు అనుమానాలకు తావిస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. పాసులు విక్రయించిన వలంటీర్లను ఆలయ అధికారులు పోలీసులకు అప్పగించారు. ఆలయ అధికారులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదుచేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.



పట్టుబడిన ఉచిత పాసు

సూర్య కుసుమం..





కొమ్మకొమ్మకూ.. వికసించిన పుష్పంలా సూర్యుడు కనువిందు చేశాడు. సాయం సంధ్యవేళ ఎరుపు, పసుపు, కాషాయ రంగులతో కలగలిపి పడమటి దిక్కున ప్రభాకరుడు ప్రకాశించాడు. మిట్ట మధ్యాహ్నం సుర్రుమనిపించినా సాయంత్రానికి ప్రకృతి ఒడిలో చల్లగా ఒదిగి పోయాడు. పొలాల్లో భానుడి ప్రతిబింభం వెలిగిపోయింది. మిరుదొడ్డి మండల పరిధిలోని లక్ష్మీనగర్ శివారులో ప్రకృతికే వన్నె తెచ్చిన ఈ సూర్య బింబాలను 'సాక్షి' కెమెరా ఇలా క్లిక్‌మనిపించింది. – మిరుదొడ్డి(దుబ్బాక)

కొండపోచమ్మ ఆలయ అభివృద్ధికి కృషి

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

జగదేవ్‌పూర్ (గజ్వేల్): కొండపోచమ్మ ఆలయ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. ఆదివారం కొండపోచమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సిబ్బంది, అర్చకులు ఆయనకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కొండపోచమ్మ ఆలయం అభివృద్ధికి నోచుకోలేదని వాపోయారు. ఆలయ అభివృద్ధి విషయం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లానన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేసి ప్రజా సంక్షేమానికి శ్రీకారం చుడతామన్నారు.

అమ్మవారికి తలసాని శ్రీనివాస్ యాదవ్ పూజలు

కొండపోచమ్మ జాతర ఉత్సవాలలో భాగంగా మూడోవారం ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, సిబ్బంది వెంకట్‌రెడ్డి, కనకయ్య, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

యాదగిరి తరహాలో మల్లన్న ఆలయం..

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయాన్ని యాదగిరి గుట్ట తరహాలో అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ విఫ్ బీర్ల అయిలయ్య అన్నారు. ఆదివారం ఆయన మల్లికార్జున స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మల్లికార్జున స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు మహాదేవుని శ్రీనివాస్, కొయ్యడ శ్రీనివాస్, కనుకరాజు, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతిపై అనుమానం

పోస్టుమార్టానికి తరలింపు



వెంకటయ్య(ఫైల్)

నంగునూరు(సిద్దిపేట): రోడ్డు ప్రమాదంలో మాజీ ఎంపీటీసీ మృతి చెందగా అంత్యక్రియలు నిర్వహిస్తున్న క్రమంలో శరీరంపై గాయాలను గుర్తించిన కుటుంబ సభ్యులు హత్య జరిగినట్లు అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు పోస్టుమార్టానికి తరలించారు. ఈ ఘటన ఆదివారం ఘణపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బండి వెంకటయ్య(50) శనివారం సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై నంగునూరు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. అర్ధరాత్రి అయినా రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతడి ఆచూకీ కోసం వెతకగా గ్రామ శివారులోని చింత చెట్టు వద్ద బైక్ పక్కన పడి ఉన్నాడు. వెంటనే నంగునూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహిస్తుండగా శరీరంపై గాయాలు ఉండడంతో హత్య చేసినట్లు అనుమానం వ్యక్తం చేస్తూ రాజగోపాల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వెంకటయ్య మృతదేహాన్ని సిద్దిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

84 కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయి, నిందితుడితో ఎక్సైజ్ అధికారి రఘురాం, సిబ్బంది

- ఆంధ్ర, ఒడిశా నుంచి మహారాష్ట్రకు తరలింపు
- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడి
- రూ.12 లక్షల విలువ: అధికారులు

పటాన్‌చెరు టౌన్: అక్రమంగా తరలిస్తున్న గంజాయిని మెదక్ డివిజన్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ రఘురాం, ఏఈఎస్ శ్రీనివాసరావు మీడియాలకు వివరాలు తెలిపారు. ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి మహారాష్ట్రకు అక్రమంగా గంజాయి తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారం రావడంతో మండలంలోని ముత్తంగి టోల్‌గేటు సమీపంలో తనిఖీలు నిర్వహించారన్నారు. ఈ తనిఖీలో కారులో తరలిస్తున్న 84 కిలోల గంజాయి పట్టుకున్నారని, దాని విలువ సుమారు రూ.12లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. అయితే పట్టుబడిన వ్యక్తి నల్గొండ జిల్లా చందంపేట్ మండలం బొల్లారం పట్టి గ్రామానికి చెందిన రమావత్ రాకేశ్‌చంద్రగా పోలీసులు గుర్తించారు. ఒక కారు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని, నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు మోహన్, రజిత, ఎస్ఐలు అనిల్ కుమార్, విశ్వనాథ్, హెడ్ కానిస్టేబుల్ హలీం, మానిక్, గోపాల్ రామారావు, సతీశ్, కరీం పాల్గొన్నారు.

ముగ్గురు దొంగల అరెస్ట్

- 8 తులాల బంగారం, 20 తులాల వెండి, 8 సెల్‌ఫోన్‌లు స్వాధీనం
- రూ.18 వేలు నగదు సీజ్: సీఐ ప్రవీణ్ రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రవీణ్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ ప్రవీణ్‌రెడ్డి, క్రైమ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వారిని పట్టుకునేందుకు స్పెషల్ టీంను ఏర్పాటు చేశామన్నారు. ఈ క్రమంలో మండలంలోని ఇస్నాపూర్‌లో బైక్, స్కూటీలపై అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని ఆదివారం అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వారిని విచారించగా గత ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు పట్టణంతో పాటు ఇంద్రేశం, చిట్కుల్, ముత్తంగి, పాశమైలారంలలో 13 చోట్ల దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి 8 తులాల బంగారం, 20 తులాల వెండి, 8 సెల్‌ఫోన్‌లు, బైక్, స్కూటీలను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. చోరీకి ఉపయోగించిన పరికరాలు, రూ.18వేల నగదును సీజ్ చేశామన్నారు. పట్టుబడిన వ్యక్తులు సదాశివపేట్ మదికుంటకు చెందిన కుమురు జంపన, బోరబండకు చెందిన విగ్నేశ్‌తో పాటు మరో బాలుడిని ఆదివారం సాయంత్రం రిమాండ్‌కు తరలించారు.

మద్యం తాగి వేధిస్తున్నాడని..
తండ్రిని హతమార్చిన తనయుడు

జిన్నారం(పటాన్‌చెరు): కొడుకు చేతిలో తండ్రి హతమైన ఘటన గుమ్మడిదల మండలంలోని రాంరెడ్డిబావి గ్రామంలో జరిగింది. ఎస్ఐ లక్ష్మారెడ్డి కథనం ప్రకారం.. రాంరెడ్డిబావి గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి తరచు మద్యం తాగి ఆయన భార్యతో గొడవ పెట్టుకునేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి వచ్చిన కృష్ణారెడ్డి భార్యను నిద్రలేపి గొడవ పడ్డాడు. వాగ్వివాదం జరగడంతో ఆమెపై చేయి చేసుకున్నాడు. దీంతో పక్కనే ఉన్న కుమారుడు రఘుపతిరెడ్డి ఆగ్రహానికి గురై అక్కడే ఉన్న కట్టెతో కృష్ణారెడ్డి తలపై బాదాడు. కృష్ణారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బావ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

బిడ్డకు జన్మనిచ్చి మృతి
వైద్యుల నిర్లక్ష్యమేనని ఆరోపణ



లత(ఫైల్)

చేగుంట(తూప్రాన్): డెలివరీ కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లిన గర్భిణి ప్రసవం అనంతరం వైద్యుల నిర్లక్ష్యంతో మృతి చెందినట్లు ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. గ్రామానికి చెందిన కావేటి లత(25)కు ప్రసవ నొప్పులు రావడంతో ఆమె కుటుంబ సభ్యులు శనివారం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. అయితే ఆమె పాపకు జన్మనివ్వగా రక్త స్రావం ఎక్కువ కావడంతో లత ప్రాణాపాయస్థితికి చేరుకొంది. దీంతో బంధువులు మెరుగైన వైద్యంకోసం సికింద్రాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే లత మృతి చెందింది. ఆమెకు నాలుగు సంవత్సరాల క్రితం కుమారుడు జన్మించగా శనివారం పాప పుట్టింది. ఆమె మృతితో ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారని బంధువులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా గ్రామానికి చెందిన మహిళ ప్రసవం కోసం వెళ్లి ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యంతో మృతి చెందినట్లు తెలిపారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి లత మృతికి కారణమైన తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి...



అమీర్ మృతదేహం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని బీరంగూడ జాతీయ రహదారిపై ఓ కారు ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని భవానీపురానికి చెందిన అమీర్(27) ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం ఇంటి నుంచి డ్యూటీకి తన బైక్‌పై బయలుదేరాడు. బీరంగూడ సమీపంలోని యూటర్న్ వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా పటాన్‌చెరు నుంచి లింగంపల్లి వైపు వెళ్తున్న కారు ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని పక్కనే ఉన్న ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నగరంలోని మరో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నీటి కుంటలో పడి..



దుబ్బయ్య(ఫైల్)

దౌల్తాబాద్(దుబ్బాక): పశువుకు నీళ్లు తాగించేందుకు కుంటలోకి తీసుకెళ్లిన రైతు ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ సాయిలు కథనం ప్రకారం.. దౌల్తాబాద్‌కు చెందిన గొల్ల దుబ్బయ్య (75) ఆదివారం మధ్యాహ్నం ఎల్లమ్మ దేవాలయం సమీపంలో కొత్త కుంటలో పశువును నీళ్లు తాగించేందుకు తీసుకెళ్లాడు. పశువు బయటకు రాకపోయే సరికి పశువు బయటకు దుబ్బయ్య కుంటలోకి దిగి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. మృతుడి పెద్ద కొడుకు గొల్ల యాదయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ సాయిలు తెలిపారు.

మంజీరాలో మహిళ మృతదేహం..

- మూటకట్టి.. బండరాయికి కట్టి..
- మంజీరాలో పడేసిన దుండగులు
- హత్యగా భావిస్తున్న పోలీసులు



ఘటన స్థలంలో డీఎస్పీ రఘు, సీఐ,ఎస్‌లు

రాయికోడ్(అందోల్): మండలంలోని సిరూర్ గ్రామ సమీపంలోని మంజీరానదిలో ఒడ్డున గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ వెంకట్‌రెడ్డి కథనం ప్రకారం.. మూటగా ఉన్న మహిళ మృత దేహాన్ని పలువురు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. జహీరాబాద్ డీఎస్పీ రఘు, జహీరాబాద్ రూరల్ సీఐ వెంకటేశం, ఎస్ఐ వెంకట్‌రెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఆమె వయసు 25 నుంచి 30 ఏళ్ల వయసు ఉంటుందని గుర్తించారు. నైటీ వేసుకుని ఉన్న మహిళ రెండు చేతులు ముందుకు కట్టేసి ఉన్నట్టు చెప్పారు. ఎక్కడో హత్యచేసి రగ్గులో చుట్టి బండరాయికి కట్టేసి మంజీరానదిలో పడేసినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఆధారాల కోసం క్లూస్ టీం మృతదేహాన్ని పరిశీలించి పలు వివరాలను సేకరించింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంటి నుంచి వెళ్లి.. చెరువులో పడి..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కనిపించకుండా పోయిన ఓ మహిళ మృతదేహం చెరువులో లభ్యమైంది. ఈ ఘటన కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తెల్లాపూర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతానికి చెందిన అంజలి(20) జీవనోపాధి కోసం తల్లిదండ్రులతో కలిసి కొన్ని నెలల క్రితం తెల్లాపూర్‌కు వలస వచ్చింది. కుటుంబ తగాదాల వల్ల భర్తను వదిలేసి తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్ళి తిరిగి రాకపోవడంతో ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికినా లభించలేదు. ఆదివారం ఉదయం తెల్లాపూర్‌లోని వనం చెరువులో ఆమె మృతదేహాన్ని స్థానికులు గమనించారు. సమాచారం అందించడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బోగస్ కార్డులకు చెక్

- కొనసాగుతున్న ఈ కేవైసీ
- 3,78,580 రేషన్ కార్డులు
- 12,33,293 లబ్ధిదారులు
- నెలాఖరు వరకు గడువు

సంగారెడ్డి టౌన్: బోగస్ రేషన్ కార్డులకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ కేవైసీ ప్రక్రియ చురుకుగా సాగుతోంది. జిల్లాలో ఇప్పటి వరకు 80శాతం ఈకెవైసీ పూర్తయింది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ సరుకులను మరింత వేగంగా అందించేందుకు, బోగస్ కార్డులకు చెక్ పెట్టేందుకు కేవైసీ తప్పనిసరి అని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఆహార భద్రత కార్డులోని సభ్యులందరూ సంబంధిత రేషన్ దుకాణాలకు వెళ్లి ఈ కెవైసీ చేయించుకోవాలని సూచిస్తున్నారు. రేషన్ డీలర్లు లబ్ధిదారుల నుంచి వేలి ముద్రలు సేకరిస్తున్నారు.

గడువు పొడిగింపు..

దేశవ్యాప్తంగా కూడా కోట్లాది మంది ఈ–కేవైసీ పూర్తి చేయాల్సి ఉండడంతో కేంద్ర ప్రభుత్వం ఈ గడువును పొడిగించింది. దీనికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ఫిబ్రవరి నెలాఖరులోగా గడువును పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో మొత్తం 12,33,293 లబ్ధిదారులు ఉన్నారు. వేలి ముద్రలు ఇచ్చి ఈ–కేవైసీ పూర్తి చేయని వారు త్వరగా పూర్తి చేయాలని సూచించింది.

వంద శాతం పూర్తిచేస్తాం..

జిల్లావ్యాప్తంగా 3,70,580 కార్డులు ఉన్నాయి. కొన్ని చోట్ల మృతి చెందిన వారి పేరిట కూడా కొందరు ప్రతినెలా బియ్యం, ఇతర సరుకులు తీసుకుంటున్నారు. కుటుంబంలో ఎవరో ఒకరు రేషన్ దుకాణానికి వెళ్లి వేలిముద్ర వేస్తే, సరుకులు సరఫరా చేస్తున్నారు. అయితే మృతుల పేర్లను కార్డులోంచి తొలగించి అర్హుల పేర్లను యాడ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఈకేవైసీ తప్పనిసరి చేసింది. లబ్ధిదారులందరూ రేషన్ దుకాణాలకు వెళ్లి ఈకేవైసీ అప్‌డేట్ చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే 80 శాతం ప్రక్రియ పూర్తయిందని 100 శాతం పూర్తి చేస్తామన్నారు.



ఈ–కేవైసీ ఇలా..

రేషన్ కార్డులో పేరున్న కుటుంబ సభ్యులందరూ సమీప రేషన్ దుకాణానికి వెళ్లి రేషన్ కార్డు నంబర్ చెప్పి వేలిముద్రలు ఇవ్వాల్సి ఉంటుంది. రేషన్ కార్డు సంఖ్యకు ఆధార్ లింక్ అవుతుంది. అనంతరం ఈ–కేవైసీ పూర్తి చేసుకున్నట్లు తెలియజేస్తూ ఈపోస్ మిషన్ నుంచి చిన్న రసీదు కూడా వస్తుంది. రాష్ట్రంలో రేషన్‌కార్డు ఉన్నవారు ఏ రేషన్ దుకాణానికి వెళ్లినా ఈ–కేవైసీ పూర్తి చేయవచ్చు. అలాగే కుటుంబ సభ్యులందరూ. ఒకేసారి వెళి వేలిముద్రలు ఇవ్వాల్సిన అవసరం లేదు. దగ్గరలో ఉన్న రేషన్ షాపులలో ఈ–కేవైసీ పూర్తి చేసుకునే అవకాశం ఉంది.

– వనజాత, జిల్లా సరఫరాలశాఖ అధికారి

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం
సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట సీపీ అనురాధ సూచించారు. కమిషనరేట్ పరిధిలో చోటు చేసుకున్న పలు సైబర్ నేరాల వివరాలను ఆదివారం ఆమె వెల్లడించారు. తక్కువ పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌ను టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి పంపాడు. బాధితుడు ఆ లింకును ఓపెన్ చేసి పలు విడుతలుగా రూ.1,01,400 పంపించాడు. తర్వాత ఆ లింకును ఓపెన్ చేయగా బ్లాక్‌చేసి ఉండడంతో బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేయగా ఖాతాలో ఉన్న రూ.74,775 ఫ్రీజ్ చేశారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి బ్యాంకు బ్యాలెన్స్ చెక్ చేసుకోవడానికి ఓ నెంబర్‌కు మెసేజ్ చేశాడు. ఆ మెసేజ్ ఓపెన్ చేయగా బాధితుడి ఖాతా నుంచి రూ.40వేలు డెబిట్ అయినట్లుగా మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు.